# ఒక దీపం వెలిగింది

"అమ్మా ! అమ్మదగ్గిలికెల్తా" ఎక్కిళ్ళు పెడుతున్న పాపని ఈ చేతి మీంచి ఆ చేతి మీదకి మార్చుకుని జేబులోంచి చాక్‌లేట్ తీశాడు నాగన్న.

"ఇదుగో ! ఏడవమాకని సెప్పానా ? ఇంద యిది తిను. అమ్మ దగ్గిరికి తీసుకెల్తాలే !"

భయం భయంగా నాగన్న ముఖంలోకి ఒకసారి చూసి ఆశగా అతని చేతిలో చాక్‌లెట్ అందుకుంది పాప.

భయాన్ని కలిగించే నల్లని అమావాస్య చీకటిలో త్వరత్వరగా అడుగులు వేస్తూ, చుట్టూ పరికిస్తూ స్టేషన్ వైపు నడకసాగించాడు నాగన్న. అది రోడ్డుకాదు .... జనసంచారం ఉన్న సందూకాదు. ఇటూ, అటూ ముళ్ళకంచెలూ, చింతచెట్లూ రాళ్ళూ రప్పలూ ఉన్న నరసంచారం లేని, మగాళ్ళకికూడా రాత్రిళ్ళు ఒంటరిగా పోవడానికి గుండెల్లో గుబులయ్యే మార్గం అది. స్టేషన్‌కి అడ్డుదోవ అది.

నాగన్నలాంటి వాడికి అటువంటి దారి కూడా భయం కలిగించలేదు.

చాక్‌లేట్ తినడం అయిపోయిన పాప "అమ్మ కావాలంటూ" నోరు తెరవబోయి, ఆ చీకటికీ, కీచుమంటున్న కీచురాళ్ళ రొదకీ హడలిపోయి కళ్ళు గట్టిగా మూసుకుని, నాగన్న భుజానికి బల్లిలా అతుక్కుపోయింది.

దూరంగా కనిపిస్తున్న రైలుస్టేషన్ని చూస్తూ "అమ్మయ్య" అను

కున్న నాగన్న రాయేదో కాలికి తగిలి ముందుకి పడబోయి నిలదొక్కుకున్నాడు.

ఇంతలోనే పక్కనించి బుస్‌మన్న సవ్వడి వినిపించడం, నాగన్న కాలికి మెత్తగా ఏదో తగలడం, ఒక్క అంగలో నాగన్న మూడుగుజాలు ముందుకి గెంతడం జరిగిపోయాయి.

"పాము" మెల్లిగా తనలో తనే అనుకుని నవ్వుతున్నాడు.

"ఈ నాగన్నని పాములేం సెయ్యగలవు? మనుసులేం సెయ్యగలరు?" పౌరుషంలాంటి పొంగు కుడిచేతిని మీసం మీదికి పోనిచ్చింది.

స్టేషన్ దరిదాపులకి రాగానే ఆ సందడికి, లైట్లకి కళ్ళు కళ్ళు తెరిచింది పాప. ఏడుస్తూ మళ్ళీ మొదలుపెట్టింది. అమ్మ....అమ్మ దగ్గిరికెల్తా."

నాగన్న ముఖం ఎర్రనైంది, కిందిపెదవి కొరుకుతూ తీవ్రంగా చూశాడు పాప ముఖంలోకి. నల్లటి పెదవులు మరింత నల్లనయ్యాయి ఎర్రని కన్నులు మరింత ఎరుపెక్కాయి. అది చూసి మరింత భయపడిపోయింది పాప.

"నువ్వా....మొండితనం నా దగ్గిర సూపిద్దావనుకుంటన్నావా?" విసురుగా జేబులోకి చెయ్యిదూర్చి చిన్న గొట్టంలాటి దేదో పైకితీసి కోపంగా పాప ముక్కుదగ్గర పెట్టాడు నాగన్న.

అంతే మరి మాట్లాడలేదు పాప.

అమ్మ కావాలని మరి ఏడవలేదు. మత్తుగా నాగన భుజమ్మీద వాలిపోయింది. బయల్దేరడానికి సిద్ధంగా ఉన్న రైల్లో ఎక్కి కూర్చున్నాడు నాగన్న.

ఒళ్ళో పాపని పడుకోబెట్టుకుని ఓ పక్కగా ఒదిగి కూర్చున్నాడు.

పక్కనే కూర్చున్న తాత మాట కలిపాడు "ఎందాకా నాయనా?"

"కొండకి. పిల్లకి ఒంటో బావుండటంలేదు. మూసిన కన్ను తెరవదు. మా ఇంటామె పోయి పదిరోజులయింది. అమ్మ బెంగపట్టు

కుంది పిల్లకి. అందుకే మొక్కుకున్నాను పిల్లని కొండకు తీసుకొత్తా నని." రుమాలుతో కన్ను లద్దుకున్నాడు నాగన్న.

"అయ్యో పాపం! నయవవుద్దిలే బిడ్డకి." అంటూనే నిద్రకి ఆగలేక జోగటం మొదలుపెట్టాడు తాత.

పక్కకి తిరిగి తన నటనకి తనే నవ్వుకున్నాడు నాగన్న.

తెల్లారుఝామునే పాపని భుజాన వేసుకుని రైలు దిగాడు.

తను ముఖం కడుక్కుని, కాఫీతాగి, పాపకోసం ఒక గ్లాసుడు పాలు తీసుకున్నాడు.

"నాకు పాలొద్దు .... అమ్మకావాలి ..." అంటూ నాగన్న చేతిలో పాలగ్లాసుని ఒక్క తోపుతోసింది పాప. పాలు సగం నాగన్న లుంగీమీద సగం నేలమీద ఒలికిపోయాయి. గాజుగ్లాసు ముక్కలై పకపకా నవ్వు తోంది.

ఒళ్ళు మండింది నాగన్నకి. "ఏంటి నీ పొగరుమోత్తనం!" అంటూ ఆ పసిపిల్లని పట్టుకుని వీపుమీద రెండు బాదాడు.

"అయ్యయ్యో! ఎందుకయ్యా పిల్లనట్టా బాదుకుంటావ్! సూడెట్టా ఏడుస్తావుందో!" ఒక పల్లెటూరి స్త్రీ, పిల్లలులేని మధ్య వయస్కురాలు ఉండబట్టలేక జాలితో పాప నందుకుంది. భర్త కాబోలు ఆమె వెనకే వచ్చాడు. నల్లగా! బండగా వున్నాడు. చేతిలో బీడీ, చేతికి వాచీ, కట్టుకున్న తెల్లటి బట్టలో నల్లగా మెరుస్తున్నాడు.

ఒక్క క్షణం వాళ్ళిద్దర్నీ పరికించి, పాపవైపు తిరిగాడు నాగన్న.

"లేకపోతే సూడమ్మా! ఎట్లా ఏపుకు తింటావుందో, పదిరోజు లైంది మా యావిడపోయి....అసలే దిగుల్తోనే నేడత్తావుంటే ఈ కూతు రేమో అమ్మ కావాలి అమ్మ కావాలంటూ నన్ను కాల్చుకు తినేత్తావుంది. ఏడవించి తెచ్చేదమ్మని. సత్తే ఈ జలమ కింకో వెళ్ళిసేసుకోన్నేను.

రత్తి నెంతగా పేమించానో ఆ బగమంతుడికే తెల్సు, నా రత్తిని నా క్కాకుండా సేశాడు." పక్కకి తిరిగి తడిలేని కళ్ళని తుడుచుకున్నాడు.

ఎఱ్ఱచీర, బీడీ ఒకరిముఖా లొకరు చూసుకున్నారు.

"మీరే సెప్పండమ్మా! ఈ పిల్ల బెంగ ఎట్టా తీర్సేది? ఏడుపు ఎట్టా మానిపించేది? పచ్చినీళ్ళు కూడా ముట్టటంలేదు పది రోజుల్నించీ, ఇట్టా అయితే ఈ పిల్ల బతికేదెట్టా? ఆడదిక్కులేని నా కొంపలో ఈ పిల్ల నెట్టా సాక్కొచ్చేదీ?" దీనంగా ఉన్నాయి నాగన్న మాటలు.

"పిల్ల పండులాగుంది. ఈ దిగుల్తో పుల్లలాగవుద్ది. నువ్వు సెప్పిందీ నిజవే...." అంటూ ఎఱ్ఱచీర కళ్ళతోనే ఏదో మాట్లాడుతూ భర్తవంక చూసింది.

"మాకు పిల్లల్లేరు. ఆ బగమంతుడే ఇచ్చాడనుకుంటాం. అమ్మా నాన్నా మేవే అయి సాక్కుంటాం....నీ కిట్టవేనా?" ఎఱ్ఱచీర నాగన్న ఉద్దేశం అడిగింది.

"ఎంతమాట! నిజంగా మీది మంచిమనసు నా తల్లి సుకపడ్డవే నా క్కావల్సింది." వికసించింది నాగన్న ముఖం.

"మరి నువ్వు మళ్ళీ మా దగ్గరికెప్పుడూ రాకూడదు సుమా!"

"అబ్బెబ్బే! నే నెందుకొత్తాను. నా రత్తిలేని లోకం నాకెందుకూ? కిష్టా, రామా అంటా సన్యాసుల్లో కలుత్తాను."

ఆనందంతో, సంబరంగా పాపని ముద్దాడింది ఎఱ్ఱచీర.

జేబులోంచి అయిదు పదులు తీసి నాగన్న చేతిలో పెట్టాడు బీడీ.

ఆ డబ్బులు కళ్ళకద్దుకుని, వాళ్ళిద్దరికీ దండాలు పెడుతూ వెనక్కి తిరిగి, నవ్వుకుంటూ ముందుకి నడిచాడు నాగన్న. ఇంత తేలిగ్గా, ఊళ్ళోకి వెళ్ళక్కరలేకుండానే, స్టేషన్లోనే పని అయిపోతుందనుకోలేదు. పని పూర్తయినందుకు సంతోషిస్తూ అట్టే ఆలస్యం చెయ్యకుండా పక్క ప్లాట్‌ఫారమ్ మీద బయల్దేరడానికి సిద్ధంగా ఉన్న రైల్లో యెక్కి కూర్చున్నాడు. పిల్లల్ని దొంగతనంగా ఎత్తుకుపోయి, ఎక్కడెక్కడో

అమ్మి డబ్బు సంపాదించే విద్యలో చెయ్యి తిరిగినవాడు నాగన్న, అదంతా వీరయ్య చలవే.

వీరయ్య గురువు....నాగన్న శిష్యుడు.

వయసు మళ్ళి, ప్రయాణాలు చెయ్యలేక వ్యాపారమంతా శిష్యుడికే అప్పగించాడు వీరయ్య. ఒక ఊళ్లో దొంగిలించిన పిల్లల్ని ఇంకో ఊరు తీసుకుపోయి అమ్మాలి. మరి లేకపోతే పట్టుపడిపోరూ తేలిగ్గా.

వీరయ్య కూతురు రత్తి. ముద్దబంతి పువ్వులా ఉంటుంది. దాని కసలు తన తండ్రి చేసే వ్యాపారం ఏమిటో తెలియదు. నిజం చెప్పా లంటే వీరయ్య, నాగన్నలు చేసేపని ఎవరికి తెల్సుగనక ? తల్లిలేని రత్తి తండ్రి చేతుల్లోనే పెరిగింది....బావ అంటే గుండెనిండా ప్రేమే దానికి. నాగన్నకీ అంతే .... ముద్దబంతి పువ్వులా అది ముసి ముసి నవ్వులు నవ్వుతో ఉంటే మనసారా చూస్తాడు. కోయిలకూసినట్టు అది ఆగ కుండా కబుర్లు చెప్తే మేనుమరిచి వింటాడు.

"బావా ! నువ్వూ, అయ్యా సేసే ఏపారం ఏంట"ని అది ఎప్పు డైనా అడిగిందంటే మాత్రం ముఖం తిప్పుకుని, పుసుక్కున మాట మార్చేస్తాడు. అలాంటప్పుడే రత్తికి బావమీద కోపం ముంచుకొస్తుంది. అయినా, నవ్వుతూ నవ్వించే వాడి కళ్ళు చూసేసరికి కోపం ఇట్టే ఎగిరి పోయేది. తను అడిగిన సంగతే మరిచి ఆ కళ్ళవంకే చూస్తూ ఎంత సేపైనా కూర్చుండిపోయేది.

ఎలాగైతే నేం తన కళ్ళముందే కూతురి పెళ్ళి అయిందనిపించి, ఓరోజు గుండెపోటు ఎక్కువై గుటుక్కుమన్నాడు వీరయ్య. పోతూ, పోతూ "యాపారంలో జాగర్తగా మసలుకోరా నాయినా, లేకుంటే పట్టుపడిపోతావ్" అంటూ నాగన్నని హెచ్చరించి మరీ పోయాడు. ఈ మాటలు విన్న రత్తి మనసులో ఎన్నో ఆలోచనలు మొలకెత్తాయి.

చివరికో రోజు తెగించి నాగన్నని అడగనే అడిగింది. "ఏంటి బావా ! నువ్వు సేసే ఏపారం ఏంటో నాకూడా సెప్పకూడదా ఏం ? నువ్వు సెప్తేగాని నే నన్నం ముట్టను."

"సెప్తే అసలు ముట్టవే...." అంటూ విరగబడి నవ్వాడు నాగన్న. చివరికి "ఎవరిదగ్గిరా ఈ మాట అనన్లెమ్మ"ని రత్తి దగ్గిర మాట తీసుకుని చెప్పాడు తను డబ్బు సంపాయిస్తున్న విధానం.

గుండెలు బాదుకుంది రత్తి.

నువ్వు చేసేది మహా పాపమంది.

దేవుడుకూడా నిన్ను మన్నించడంది. ఇటువంటి వెధవపని చెయ్యడానికి నీ కెలా మనసొప్పింది అంది.

ఎన్ని అన్నా చలించలేదు నాగన్న శిలా హృదయం.

పైగా "శివుడాగ్నె" కాందే సీమైనా కుట్టదంటారుకదే. ఆ బగమంతుడే నా సేతిలా సెయ్యిస్తున్నాడు" అంటూ మీసాలు మెలేసి నవ్వాడు.

"సెయ్యక సెయ్యక ఇటువంటి పాడుపనే సేసి డబ్బు సంపాయించాలా? ఇంకేపనన్నా సేసుకు బతగ్గూడదా" అంది రత్తి కోపాన్నంతా మనసులోనే అణిచిపెట్టి కన్నీ రద్దుకుంటూ.

"పిచ్చిదానా! ఈ మాత్తరానికే కన్నీరెందుకే? మీ అయ్య బతికిం దిట్టాగే. నాక్కూడా అదే విద్దె నేర్పి పోయాడు. ఇందులో బయపడేందు కేవుందే? సాల్లే....లే... ఎవరిదగ్గిరైనా అనేవు గనక! నోరు జాగర్త" అంటూ లే చ్చక్కా పోయాడు నాగన్న.

ఆ రోజునించీ తిండి సరిగ్గా నయించట్లేదు రత్తికి. అస్తమానం నాగన్నని గురించిన కలలే నిద్దట్లో. నాగన్నని పోలీసులు లాకెళ్తున్నట్టు కలలొచ్చి ఉలిక్కిపడి లేచి కూర్చునేది. చీకటిలో నల్లటి నాగన్నశరీరం పక్కమీద చూసి మళ్ళీ వెనక్కి వాలేది, కళ్ళు గట్టిగా మూసుకుని నిద్ర పట్టించుకోవడానికి ప్రయత్నిస్తూ.

* * *

చెట్లన్నీ ఆకులు రాల్చాయి. మళ్ళీ చిగుళ్ళు వేశాయి. వానలు కురుస్తున్నాయి. వెలుస్తున్నాయి. ఆకాశంలో మబ్బులు ఇట్టే నల్లబడి ఇట్టే తెల్లబడుతున్నాయి.

ఆరోజు బాగా పెద్దవానే కురిసి వెలిసింది. గాలి హోరుమాత్రం తగ్గలేదు. హోరుగాలికి కిటికీ తలుపులు టకటక మంటున్నాయి. గాలి విసురుకి చెట్లు ముందుకీ వెనక్కీ నాట్యం చేస్తున్నాయి ఏవేవో పూల వాసనలు మత్తుగా గాలిలో కలిసి నాలుగువైపులా పరుగులెడుతున్నాయి.

నాగన్న కాళ్ళు భూమిమీద నిలవటంలేదు. కూతురు పుట్టిందన్న సంబరంతో గాలిలో తేలిపోతున్నాడు.

ఊహకందని ఆనందంతో, గర్వంతో కళ్ళు వెలిగిపోతుండగా రత్తిని పలకరించు, పసిగుడ్డుని ముద్దాడి వాళ్ళ క్కావల్సినవన్నీ అమర్చ డంలో మునిగిపోయాడు. రత్తి కళ్ళల్లోమాత్రం కాంతిలేదు.

ఏదో దిగులూ, ఏదో భయం .... కాసేపు సంతోషం కాసేపు విచారం .... ఏదో తెలియని ఆవేదనలో మనసు అల్లల్లాడుతుండగా పసిబిడ్డని మరింత దగ్గరకి లాక్కుని గుండెల కదుముకుంది.

"ఏంటే! నీ బిడ్డని ఏరన్నా ఎత్తకపోతారా ఏంటి అట్టా గుండెల్లో దాసేసుకుంటన్నావ్!"

ఉలిక్కిపడి చూసింది. నవ్వుతూ, లోపలి కడుగు పెడుతున్నాడు నాగన్న. నాగన్న ముఖంలో సంతోషం, కళ్ళల్లో కాంతి తప్ప మరేం కనిపించలేదు రత్తికి. ఏదో చెప్పాలని ఉందికానీ చెప్పలేక పోతోంది. కళ్ళు మూసినా, తెరిచినా ఏవేవో పీడకలలు. చివరికి కళ్ళు గట్టిగా మూసుకుని నిద్ర పట్టించుకోడానికి ప్రయత్నం చేసింది.

* * *

గౌరి చెప్పే ముద్దు మాటలతో పొంగిపోతాడు నాగన్న. కూతు రంటే ప్రాణమైనా ఇస్తాడు. దాని క్కాస్త ఒంట్లో బాగులేకపోతే గిల గిల్లాడిపోతాడు. రకరకాల బొమ్మలు, రంగురంగుల బట్టలు తెచ్చి దాని ముందు పడేసి ఉప్పొంగిపోతాడు.

"ఇదుగో దీపాలమాస్యకి గౌరికి గాజులు సేయించాను" అంటూ ముద్దుగా, ముచ్చటగా మెరుస్తున్న బంగారు గాజులు రెండు రత్తి చేతి కందించాడు.

మురిసిపోయింది రత్తి. కూతుర్ని తనివితీరా ముద్దాడింది. గాజులు భద్రంగా పెట్టె అడుగున దాచింది.

* * *

దీపావళిరోజు గౌరికి తలంటుపోసి, కొత్త బట్టలు తొడిగి, పెట్టెలోంచి గాజులుతీసి ఒక్కసారి కళ్ళ కద్దుకుని, గౌరి బుల్లి బుల్లి చేతులకి తొడిగి ఆ చేతుల్ని ముద్దాడింది.

ఇంతలో కొత్తబట్టలు తొడుక్కుని పక్కింటి పిల్లలు కిలకిల్లాడుతూ వచ్చారు. వాళ్ళకి గౌరంటే ముద్దు. గౌరితో ఆడుకుందుకు రోజూ వస్తూనే ఉంటారు. వాళ్ళందరి చేతుల్లో మిఠాయిపెట్టి "మీరంతా ఆడుకుంటా వుండండి. నే నిప్పుడే వంటపని సూసుకొనొత్తా" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది రత్తి.

ఆ పిల్లలంతా గౌరిని బయటికి తీసుకుపోయి ఆటల్లో పడ్డారు. వీధినిపడి ఆడుతున్న ఆ పిల్లలు గౌరి సంగతి మర్చేపోయారు.

ఇంట్లోకి వస్తూనే "గౌరీ" అంటూ అడుగు పెట్టాడు నాగన్న. కొత్తచీర అందాన్ని చూసుకుంటూ వంటింట్లోంచి ఇవతలికి వచ్చింది రత్తి.

"గౌరేదే?" నాలుగు పక్కలా చూశాడు నాగన్న చేతిలోమందు సామాను పక్కన పెడుతూ.

"అబ్బా! ఇయన్నీ గౌరికోసవే! గౌరి టపాసులు కాలుత్తాదా?" నవ్వింది రత్తి.

"అబ్బ! ముందు గౌరేది సెప్పమంటే ...." చిరాకు ధ్వనించింది నాగన్న గొంతులో.

చివుక్కుమంది రత్తి మనసు.

ఎదురుగా తను కొత్తచీర కట్టుకు నిలబడితే, తన గురించి ఒక్క మాటైనా ఆడడు. ఈ చీరలో తనెట్టా ఉందో ఒక్కముక్క సెప్తే నో రరిగిపోద్దా! మూతిరుస్తూ వెనక్కి తిరిగింది. "ఎక్కడికి పోద్ది .... అంత కంగారెందుకూ? బయట పిల్లల్తో ఆడుకుంటా ఉంది."

"ఏహే! బయచే కనిపిత్తే నిన్నెందు కడుగుతాను...." అడుగు ముందుకెయ్యబోయి అక్కడే నిలబడిపోయింది రత్తి.

..."బాగా సూశావా! పద సూద్దాం ... పక్కింటి పిల్లల్తో బయ టాడతా ఉందిగా" ఒక్క ఉదుటున వీధిలోకి వచ్చింది. పండగ సంబరం ప్రతి ఒకళ్ళ ముఖంలో తాండవిస్తోంది

రంగు రంగుల బట్టల్లో పిల్లలంతా రకరకాల ఆటలు ఆడుతూ, గెంతుతూ అలిసిపోతున్నారు. రత్తి కళ్ళు గబగబా నాలుగువైపులా వెదికాయి. ఉహూ! గౌరి జాడలేదు. పరుగున వెళ్ళి ఎక్కింటి పిల్లల్లో కాస్త పెద్దదయిన చిట్టిని పట్టుకుంది. "చిట్టీ .... గౌరే దమ్మా?"

గబుక్కుని ఇటూ, అటూ చూసింది చిట్టి. భయంతో రెప్ప లల్లార్చింది. "మరే....మరే .... ఇక్కడే ఉండాలే...." అంది చివరకు తడబడుతూ.

పేరుపేరునా వరసగా పిల్లలందర్నీ గౌరి గురించి అడిగింది. అందరూ కూడా ఏమో. ఏమో అంటూ చేతులు తిప్పారు.

పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు నాగన్న.

చేతిలో బీడీ విసురుగా నేలకేసి కొట్టాడు.

"నువ్వటు పోయి అందరిళ్ళల్లో సూసిరా. నే నిటు వెదుకుతా" అంటూ ఒక్క పరుగు పుచ్చుకున్నాడు.

ఈ వైపు వెతుకుతూ రత్తి నడిచింది.

ఒక్కటి కూడా వదలకుండా అన్ని గడపల్లోనూ అడిగింది. లాభం లేకపోయింది చివరికి, నాగన్నకి కనిపించే ఉంటుందన్న ఆశతో ఇంటికి తిరుగు ముఖం పట్టింది. ఎక్కడా అగుపడక చెరువుకట్ట దగ్గరకి, శివాలయం కాడికీ కూడా పోయొచ్చాడు నాగన్న. రత్తికి కనిపించిందేమో నన్న ఆశతో ఇంటికి చేరుకున్నాడు

రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుని ఏడుస్తున్న రత్తిని చూసి కొయ్యబారి పోయాడు. "రత్తీ" అంటూ పిచ్చిగా అరిచి కూలబడి పోయాడు.

సాయంత్ర మవుతోంది.

పొద్దున్నించీ పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టకుండా దుఃఖిస్తున్న నాగన్న రత్తి ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"టపాసులు కాల్చేటయిమవుతా ఉంది .... లే రత్తీ లే....గౌరిని తీసుకొద్దాం...."

తెల్లబోయి చూసింది రత్తి.

"మల్లీ ఎతుకుదాం పద.... తప్పకుండా అగుపడుద్ది నా గౌరి. యాడకి పోతది."

లేవాడు నాగన్న.

వెనకే నడిచింది రత్తి.

రత్తి మనసులో అంతులేని ఆరాటం.

నాగన్న మనసులో గుబులు.

కీడెంచిన రత్తి హృదయానికి రంపపు కోత.

మేలు జరగాలని ప్రార్థిస్తున్న నాగన్న గుండెల్లో దడ.

రత్తి కన్నుల్లో ఆశ, నిరాశల కదలిక.

నాగన్న కన్నుల్లో గౌరి స్వరూపం.

నడుస్తూనే ఉన్నారు.

చెట్టులూ, పుట్టలూ వదలకుండా వెతుకుతూనే ఉన్నారు.

ముందు రత్తి .... వెనకే నాగన్న.

"బావా!" ఒక్క కేక పెట్టి నిలబడిపోయింది రత్తి. భయంతో శరీరమంతా వణికి పోతోంది.

"ఏందే రత్తీ" పడిపోబోతున్న రత్తిని తనచేతుల్లో పట్టుకున్నాడు నాగన్న.

అదురుతున్న పెదవుల్ని అదుపులో పెట్టుకోలేక చేత్తో ముందుకి చూపించింది రత్తి.

చూశాడు నాగన్న.

నాగజెముడు పొద పక్కని జీవంలేని గౌరి.

"గౌరీ !" దిక్కులు ప్రతి ధ్వనించిన నాగన్న గొంతు.

ఒక్క అంగలో వెళ్ళి పడ్డారు ఇద్దరూ.

"గౌరీ ! గౌరీ !...." గుండెలు నలిపే బాధ .... నమ్మలేక, నమ్మిక తప్పని పచ్చి నిజం ఎదురుగా పకపక మంటోంది. అప్రయత్నంగా రత్తి కళ్ళు గౌరి చేతుల మీద పడ్డాయి. ఆ చేతులు బోసిగా నవ్వుతున్నాయి.

"తెలిసింది బావా.... తెలిసింది. నా గౌరిని ఏ వెధవో ఎందుకు పొట్టన పెట్టుకున్నాడో తెలిసింది. ఇటు చూడు" గౌరి బుల్లి బుల్లి చేతుల్ని గుండెల కదుముకుంది రత్తి. అర్థం కాలేదు నాగన్నకి.

"గౌరికి తలంటి పోసి, కొత్త బట్టలేసి, నువ్వు సేయించిన ఆ గాజులు తొడిగాను బావా.... ఆ గాజులే నా తల్లిని పొట్టనపెట్టుకున్నాయి. ఏ దొంగో గాజుల కోసం నా తల్లిని మింగేశాడు." వెక్కి వెక్కి ఏడుస్తోంది రత్తి.

కట్టలు తెంచుకు ప్రవహించే దుఃఖంతో గౌరిమీద పడి ఏడుస్తున్నాడు నాగన్న.

ముందు దుఃఖం నించి తేరుకున్నది రత్తే.

"హూ ! ఎందుకట్టా ఏడుత్తావు బావా ? ఎంతమంది తలిదండ్రుల ఉసురో నీకు తగిలింది. అందుకే మన గౌరి మనకి దూరమైనాది."

చివాలున తల ఎత్తాడు నాగన్న.

అసలే ఎఱ్ఱగా ఉండే కళ్ళు, దుఃఖంతో మరింత ఎఱ్ఱగా జ్యోతుల్లా మండుతున్నాయి.

"నేనేవన్నా బిడ్డల్ని ప్రాణాలు తీశానా ?"

బలవంతంగా నవ్వింది రత్తి "హూ ! ఎంతమంది బిడ్డల్నో ఎత్తుకు పోయి ఎన్ని చోట్లో అమ్మావు. కన్న తల్లిదండ్రులకి తమ బిడ్డ

బతికుందో, పోయిందో కూడా తెలియదు గదా! ఎత్తుకు పోయిన పిల్లల్ని నువ్వింకెవరికో అమ్మితే మాత్రం కన్నోల్లకి బిడ్డ కరువేగదా! ఆల్లకి తపబిడ్డ సచ్చిన వోల్లల్లోనే జమేగదా.... మరి ఇంత గోర పాపం విన్నూారికే వొదులుద్దా! నాకు తెలుసు .... ఈ పాపానికి మనకి ఈ జనమలోనే శిచ్చ పడతాదని .... గౌరి పుట్టిన నాటినించే నా గుండెల్లో గుబులెక్కువైనాది. నాకు బిడ్డ కరువు సెయ్యొద్దని నిత్తెం ఎన్ని దేవుల్లకో మొక్కుతున్నాను. కానీ ఆ బగమంతుడు నా మొర ఆలకించ లేదు...." దుఃఖాన్ని ఆపుకోడానికి చేసిన ప్రయత్నం వ్యర్థం కాగా గౌరి మీద వాలిపోయింది రత్తి. నాగన్న గుండెల్లో గునపాలు దిగాయి.

మనసు చిత్రహింసకు గురి అవుతోంది. మూగగా అలాగే చూస్తుండిపోయాడు.

చెట్లసందుల్లోంచి, దూరంగా ఇళ్ళల్లోని దీపాల వరసలు మిలమిల లాడుతున్నాయి. ఏదో సందేశాన్ని లోకానికి చెప్తున్నాయి. చెట్లమీద పిట్టలు కిచకిచలాడుతున్నాయి. నింగిలో నల్లదనం నాట్యం చేస్తోంది.

ఇన్నాళ్ళూ పేరుకుపోయిన చీకటిని పారద్రోలుతూ నాగన్న మనసులో ఒక దీపం వెలిగింది.

★